

# తోడొకరుండిన....

## - శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

**నలుగురు లంచ్** టైంలో కలవటం పుస్తకాలమీద చర్చ కొనసాగుతూనే వుంది.

లూసీ మనిషి ఇక్కడే వుంది కాని చూపులు  చెవులంతా గేటు వైపే వున్నట్టుగా వుంది. రెండున్నరకు హఠాత్తుగా లేచి బాగ్ చేతిలోకి తీసుకొని "నాకు పనుందే నే వెళ్తా." అంటూ వెళ్ళిపోయింది.

అదే విధంగా ప్రతిరోజూ అదే టైంకు వెళ్ళిపోవటం గమనించారు మిత్రత్రయం.

"ఈ లూసీ రోజూ ఒకే టైంకి వెళ్ళిపోతోంది. దీని సంగతి ఏంటో ఈ రోజు తేలుస్తా." లూసీ రాక ముందే కుసుమ ఫ్రెండ్స్ తో చెప్పింది.

"పోనీయ్ కుసుమా తన సంగతి మనకెందుకు?"

టైం రెండు పది అయింది. "నాకు కాస్త పని వుంది. నేను లైబ్రరీకి వెళ్ళుతున్నాను." లవర్స్ రాక్ వద్ద నుండి ఇవతలకు వచ్చి, చెట్ల మధ్యగా ఎవరికి కనబడకుండా గేటు కనిపించేలా నక్కి కూర్చుంది కుసుమ.

సరిగ్గా రెండున్నర. గేటుకు కొంచం అవతల ఒక బైక్ మీద కూర్చున్న ఒక కుర్రాడు పిల్లి కూత వంటి హారన్ మోగించాడు. కుసుమ ఆశ్చర్య పోయింది. ఆ రోజు అమ్మాయిలను వెంబడిస్తూ పోయిన కుర్రాళ్ళల్లో లూసీ వెనకపడ్డ కుర్రాడు. మరి రెండు నిమిషాలలో లూసీ రావటం బైక్ వెనక అటుఇటు కాళ్ళు వేసుకొని కూర్చొని అతన్ని గట్టిగా వాటేసుకోవటం రయ్యిమని బైక్ బయల్దేరటం అన్ని నిమిషాల మీద జరిగిపోయింది.

కుసుమ కొన్ని క్షణాలు తేరుకోలేకపోయింది. అక్కడే ఒక్కతీ చెట్టు కింద కూలబడిపోయింది.

ఏంటో చెప్పరాని దిగులు. అసలు లూసీ ఎవరు తను ఎవరు? అందరితో అనుబంధం పెంచుకోవటం దేనికి? లూసీకి ఏదో అయిపోతుందని తను దిగులు పడటం దేనికి. తనను తాను ప్రశ్నించుకుంది.

సునంద పిన్ని చెప్పింది నిజమే. లూసీతో స్నేహం మెల్లిమెల్లిగా తగ్గించుకోవాలి.

మళ్ళా తనలోని అంతరాత్మ వెన్ను తట్టింది. శ్రీహరి ఆదుకున్న యాది, నాయనమ్మ అండగా నిలిచిన నరిసి గుర్తుకొచ్చారు.

ఉహుఁ లూసీని అట్లా వదిలేయకూడదు. ఏదో ఒకటి చేయాలి.

నెమ్మదిగా నడిచి వస్తున్న కుసుమను చూసారు తరుణి పూర్ణిమలు.

"ఏమయిందే? ఎక్కడకు అట్లా వెళ్ళావు? లైబ్రరీకని వెళ్ళావు? గేటు దగ్గరనుండి వస్తున్నావు?" ప్రశ్నల పరంపర కురిపించారు.

"లూసీ ఎంత దిగజారిపోయిందో చూసి వస్తున్నాను."

అర్ధం కానట్టు చూసారు ఇద్దరూనూ.

"ప్రతిరోజూ రెండుగంటల సమయంలో ఒక రకమైన పిల్లికూతల వంటి శబ్దం వినిపించటం, వెంటనే లూసీ లేచి వెళ్ళిపోవటం.

రెండింటికి ఏదైనా సంబంధముందేమో గమనించారా?"

"అవును. వినిపిస్తున్నది. కాని, అది ఏదో ఫాన్సీ బైక్ హారన్ అనుకుంటాను. దానికి లూసీకి సంబంధమేమిటీ?"

"ఆ హారన్ లూసీకి సిగ్నల్. అవును. ఆ రోజు దాని వెనకాల ఫాలో అయిన కుర్రాడు దీనికి లైన్ వేసాడు. వాడితో తిరగటానికి వెళ్ళుతున్నది."

నమ్మ లేనట్టు చూసారు ఇద్దరూ. "ఛ. అనవసరంగా దాన్ని అనుమానిస్తున్నావేమో?"

"నాకూ అది అబద్ధం అవుతే బాగుండుననిపిస్తున్నది."

"మరి ఆ రోజు అట్లా అన్నదే?"

అందరికి ఆ నాటి విషయం గుర్తుకొచ్చింది.

స్మితకు అండగా నిలబడిన మరుసటి రోజు అల్లరి మొదలెట్టిన అమ్మాయిలు అందరికి బుద్ధి వచ్చినట్టు లెంపలేసుకున్నారు. "ఛీ. బుద్ధిలేక అల్లరి చేసాము. మంచి పనయింది. మాఇంట్లో ఈ విషయం తెలిసి వుంటే ఇంకేమన్నా వుందా? చంపేసేవారు. ఈ పాటికి గదిలో పెట్టి తాళం వేసేవారు." ఆ విషయం తలుచుకుంటేనే వణికి పోసాగింది స్మిత. "ఏయ్ తరుణి థాంక్సబ్బా. మీరు భరోసా ఇచ్చేటప్పటికి నాకు ధైర్యమొచ్చింది."

"లూసీ నిన్న ఆ అబ్బాయి నీ వెనక పడ్డాడు కదా, ఏమన్నా అన్నాడా?"

"అరె నన్ను అననికి దమ్ములా? మాట్లాడెందుకు కోషిష్ చేసిండు. నేనూకుంటనా మంచిగ జవాబిచ్చిన. ఇగ పోనియ్య రాదే అయిపోయిందేదో ఐపోయింది. ఆ ముచ్చటెందుకు మర్చిపోండి." అంటూ మాట మార్చేసింది.

"మనల్ని ఎంత బురిడీ కొట్టించిందే? వాడే దాన్ని బుట్టలో వేసాడో? ఇదే వాణ్ణి మాయ చేస్తోందో?"

అప్పుడే అందరికి ఇంకో విషయం కూడా జాపకం వచ్చింది

లూసీ ఇంతకాలం మేకప్ హైర్ స్టైల్ పిచ్చిపిచ్చిపోకడలు పోతూ లేటెస్ట్ మాడలైనా సాధారణమైన బట్టలు వేసేది. అటువంటిది ఈ మధ్య రకరకాల మాచింగ్ జువెలరీ కాస్ట్లీ బట్టలు వేయటం మొదలెట్టింది. రకరకాల పర్ఫ్యూంస్ కూడా వాడుతోంది.

"ఏం లూసీ కొత్తకొత్త డ్రెసెస్ నగలు కొంటున్నావు. ఏం సంగతి?" అని అడిగిన వాళ్ళకు "మా కజిన్ వచ్చింది. ఆమె తెచ్చింది", అంటూ చెప్పటం కూడా అనుమానానికి దారి తీస్తోంది. అయినా అంత కాస్ట్లీ గిఫ్ట్స్ ఇచ్చే కజిన్ ఎవరు దానికి?

"అంతెందుకు రేపు అందరమూ రెడ్ హాన్డెడ్ గా పట్టుకుందాము."

"పట్టుకొని ఏం చేస్తాము? అదేమన్నా చిన్న పిల్లనా, ఇంట్లో చెప్పుతా అని బెదిరించటానికి?

"ఏమో  మన ప్రయత్నం మనం చేయాలి. అప్పటికి కూడా వినక పోతే అట్లాగే తన కర్మ అని వదిలేయాలి." మొండిగా చెప్పింది కుసుమ.

"సరే, నీ మాట ఎందుకు కాదనాలి? అసలు అతను తన కోసమే వచ్చాడో? లేకపోతే ఒట్టి కోఇన్సిడెన్సో కన్ఫర్మ్ చేసుకొని మాట్లాడాలి."

మర్రోజు......

లంచ్ అయింది. టైం రెండూ పది. "పూర్ణిమా, సునంద పిన్ని గాజులు తెమ్మందిగా! సుల్తాన్ బజార్ వైపు వెళ్ళొద్దాము. తరుణీ నువ్వుకూడా వస్తావా? నీకు క్లాస్ వుందా?"

"లేదు. నేను కూడా వస్తాను పదండి. లూసీ నీకు వేరే ఏమైనా పనివుందా, వస్తావా?"

కాస్త ఇబ్బందిగా మొహం పెట్టింది. "ఈ రోజు ఆఫ్టర్నూన్ క్లాసెస్ మిస్ అవుతారా? ఎందుకు క్లాసయిన తరువాత వెళ్ళొచ్చుగా!"

"అంత ఇంపార్టెంట్ క్లాస్లేమీ లేవు. అయినా రెగ్యులర్గా ఎటెండ్ అయే వాళ్ళము. ఒకసారి మిస్ చేసుకున్నంత మాత్రాన ఏమీ ఫరవాలేదు. పదండి."

నలుగురూ గేటు దాకా వచ్చారు. టైం సరిగ్గా రెండున్నర. బైక్ మీద కుర్రాడు కనిపించాడు. లూసీ ఒక్క అడుగు వెనక్కి వేసి. తక్కిన వాళ్ళకు కనబడకుండా చేస్తున్నాననుకొని చేత్తో అతనికి ఏదో సైగ చేసింది.

అందరూ సుల్తాన్ బజార్ వైపు అడుగేసారు. బైక్ ఆ పక్కనే ఆపినట్టు తెలుస్తున్నది.

సడన్గా, "మీరు వెళ్ళిరండబ్బా, నాకు వేరే పని వుంది. మళ్ళీ కలుస్తా." అంటూ సమాధానం కోసం కూడా ఆగకుండా చరచర మరో దిక్కుకు నడిచింది.

మిత్రత్రయం కూడా కొంత ముందుకు వెళ్ళి పక్కనే షాప్ పక్కగా నక్కి నిలబడ్డారు. వాళ్ళందరూ కనుచూపుమేర దాటిపోయారని భ్రమ పడ్డ లూసీ గబగబ బైక్ దగ్గరకు వెళ్ళి వెనక కూర్చొని, అతన్ని పోనియ్యమని తొందర చేయటం స్పష్టంగా కనిపించింది.

"నేనెప్పుడో చెప్పాను మీకు. ఆ అమ్మాయి గురించి మీరు చెప్పిన దాన్ని బట్టి చూస్తే ఆమె స్నేహం వల్ల మీకు కూడా సమస్యలు వచ్చే ప్రమాదం వుంది. మీ స్నేహితులను బట్టి నీ గుణం అంచనా వేయవచ్చు అని అంటారు. ఒకసారి చెడు స్నేహాలు మరిగిన తరువాత ఆమె ఎవరు చెప్పినా వినేటట్టులేదని అనిపిస్తున్నది. ఇంక ఈ విషయాలను మర్చిపోయి మీ చదువులు మీరు చూసుకోండి." జరిగిన విషయాలన్ని సునందకు చెప్పి వాపోయిన స్నేహితులకు హితబోధ చేసింది.

ఒళ్ళో నాలుగు నెలల పసివాడు కుయ్కుయ్లాడటం మొదలెట్టాడు.

సునందకు పుట్టింటితో మళ్ళీ అనుబంధం పెరగటానికి కారణమైన కుసుమంటే అందరికి మక్కువ కలిగింది.

సావిత్రమ్మ మనుమరాలికి తోడుగా పురుడయ్యేదాకా ఇక్కడే వుండిపోవటం, కుసుమ నాయనమ్మ తాతయ్య కూడా తరుచుగా రాకపోకలు సాగించటంతో వయో వృద్ధులకు వాళ్ళతోబాటే పిల్లలకు సెలవురోజుల్లో మంచి కాలక్షేపం అయ్యేది. అందరూ ఒకటే చోట చేరి వసుధైక కుటుంబంలా అనిపించేది. అప్పుడప్పుడూ కోడళ్ళు కూడా వారితో చేరేటప్పటికి, అది సునంద పురుడులాగా కాకుండా ఒక పెళ్ళి ఇల్లులా అనిపించేది.

పండంటి కొడుకును కన్నది సునంద.

వాడికి పేరుపెట్టే భాధ్యత కుసుమ మీద పెట్టారు.

"సునంద పిన్నీ, నేను వీడికి ఒక మాం...చి పేరు ఆలోచించి పెట్టాను. అయితే ఒక కండిషన్. నువ్వు ఇంకా ముగ్గురు పిల్లలని కనాలి. అప్పుడే ఆ పేరుకు అందం." చిలిపిగా నవ్వుతూ చెప్పింది కుసుమ.

"అమ్మో ఇంకా ముగ్గురే! నా వల్ల కాదమ్మా." భయపడ్డట్టు నటించి, మళ్ళీ ఆరాటం పట్టలేక, "అయినా కుసుమా ఆడపిల్లలా? లేకపోతే వీడిలాగా మగపిల్లలేనా?" అని ఆరా తీసింది.

"ఎవరైనా ఫరవాలేదు. నేను సెలెక్ట్ చేసిన పేర్లు ఎవరికైనా పెట్టవచ్చు. అంత అందమైన పేర్లు. నువ్వు ఊ అను నేను చెప్పేస్తాను."

"సరేలే, నువ్వంతగా అడుగుతున్నావు కాబట్టి ఏదో ప్రయత్నంచేస్తానులే." అభయ హస్తం చూపించింది.

"చాల్లేండే మీ అల్లరి. ఏరా బంగారూ నీ మనసంతటి చక్కని పేరు పెట్టరా." నాయనమ్మ అన్నది.

"అయితే వినండి. ఇది చక్కగా మంచు కురుస్తున్న రోజులు కదా, కనుక వీడి పేరు హేమంత్." అందరి రియాక్షన్ కోసం చుట్టూ చూసింది.

"భలే బాగుందే పేరు. వెరైటీగా వుంది. నాకైతే తెగ నచ్చేసింది." తన సంతోషాన్ని వ్యక్తపరిచిన సునంద అత్తగారి అభిప్రాయం కోసం చూసింది. "బాగుందమ్మాయి హేమంత్. హేమూ అని పిలుచుకోవచ్చు."

"అవునే పిల్లా, ఇంకా ముగ్గురిని కనమంటున్నావే వాళ్ళకు పేర్లేం నిర్ణయించావే?"

"ఇందులో ఇంకో కండిషన్. పుట్టబోయే వాళ్ళను ఎప్పుడంటే అప్పుడు కనగూడదమ్మాయి. వసంతంలో ఒకరిని, అట్లాగే శిశిరంలో, చివరన శరదృతువులో కనాలి. అప్పుడు వాళ్ళ పేర్లు కూడా ఆడైతే వసంత శిశిర శరద అని పెట్టాలి. మగ వాడైతే వసంత్, శిశిర్, శరద్ అని పెట్టాలి. కనక అట్లా కనటానికి ప్లాన్‌చేసుకో."

కుసుమ మాటలకు అందరూ నవ్వేసారు.

సునంద చెప్పిన తరువాత కుసుమ తరుణి పూర్ణిమ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు.

తరువాత జరిగిన సంఘటనల ప్రభావం అందరి మనసుల్లో గాఢంగా నాటుకు పోయాయి.

ఆ రోజు కాలేజీకి వచ్చిన లూసీ మొహంలో ఏదో తేడాకొట్టొచ్చినట్టు కనిపించసాగింది. మొహమంతా వుబ్బినట్టు కనిపించింది. కళ్ళ కింద సంచుల్లాగా తయారయ్యాయి. మొహం మీద మెడమీద చిన్నచిన్న గాట్లు.

"హేయ్ లూసీ, ఏంటది? మొహమంతా అట్లా వుంది?" ఎంత కాదనుకున్నా చిన్ననాటి స్నేహితురాలు. అడగకుండా వుండలేకపోయింది కుసుమ.

"ఏమ్ లేద్వే. షర్మిల వాల్ల నాయ్నకు నైట్ క్లబ్ వుంది కద. ఆడ నాకు ఆర్కెస్ట్రాల పాడనికి చాన్స్ వచ్చింది. ఈ మద్యల అప్పుడప్పుడు ఆడ పాడుతున్న. నిన్న జర లేటవబటికి నిద్ర లేక మొకం వుబ్బింది."

"నీకేమైనా పిచ్చా? చక్కటి గొంతు. మంచి మంచి ప్రోగ్రామ్స్ లో పాడక, నైట్‌క్లబ్ లో పాడటమేంటే?"

"లేద్వే, గా ఆర్కెస్ట్రా సినిమలల కూడ చాన్స్ ఇప్పిస్తమన్నరు. అందుకనె వాల్లతోని పాడుతున్న."

"చావు. నీకు మంచి చెప్పితే అర్ధం కావటం లేదు. అయినా నీకు అడ్డమైన తిరుగుళ్ళు ఎక్కవైనయి. చదువులో శ్రద్ధ లేకుండా పోతోంది. ముందర ఈ డిగ్రీ పూర్తి చేయవే?" ఏదో తన స్వంత చెల్లెలు చెడిపోతున్నంత దీనంగా మాట్లాడుతున్న కుసుమను పూర్ణిమ వారించబోయింది.

"కుసుమా, లూసీ ఏమైనా చిన్న పిల్లనా? తన బాగోగులు తనకు మనకన్నా బాగానే తెలుసు. వదిలెయ్యి."

నలుగురు దర్బార్ హాల్ మెట్లమీదనుండి కిందకు దిగుతున్నారు. వెనక నుండి సీమ గ్లోరియా వస్తున్నారు. వారిద్దరు స్కూల్లో వీళ్ళతో కలిసి చదివారు. వారిద్దరి ఫామిలీస్ లూసీ ఫామిలీ ఒకటే చర్చ్ మెంబర్స్ అవటాన వాళ్ళకు పరిచయాలు బాగానే వున్నాయి.

వీళ్ళను దాటిపోతూ వెనక్కు తిరిగి లూసీ వైపు హేళనగా చూస్తూ, "ఏందే పోరీ, మాట్నీ అయింది. ఇప్పుడు మంచిగ ఫస్ట్ షో, లేట్ నైట్ షో కూడ మొదలైనట్టున్నది. పర్సుల పైసలు మస్తు కలక్ట్ అయినట్టుంది. ఇంక మస్తీ మజా. జల్సనే జల్స." అని వెకిలిగా నవ్వుకుంటూ ముందుకు సాగారు.

లూసీ గబగబ అడుగులు ముందుకు వేసి వాళ్ళకెదురుగ నిలబడి, "ఏందే కుక్కలెఖ్ఖ మొరుగుతున్నవ్? మల్ల నా గురించి మాట్లాడినవో పళ్ళు రాల్తయ్ భద్రం."

"పోపొవె. నిన్నెవరన్నరు? నీతోని మాట్లాడింది ఎర్కయిందంటె మా ఇంట్ల చెమ్డా తీస్తరు." అంటూ లూసీని విదిలించుకు ముందుకు

సాగారు వాళ్ళిద్దరూ.

లూసీ వాళ్ళతో ఘర్షణ పడుతూండగానే మిత్రత్రయం దొరికిందే సందని తప్పించుకొని వెళ్ళివాళ్ళ అలవాటైన ప్లేస్లో కూర్చున్నారు.

జరిగిన విషయం గురించే డిస్కస్ చేసుకుంటూ వుండి పోయారు.

"కుసుమా, ఈ మధ్య మనం పూర్తిగా లూసీ గురించే ఆలోచిస్తూ మనసులు పాడు చేసుకుంటున్నాము. ఇకనైనా తనను వదిలించుకొని మన రొటీన్లో పడాలి." పూర్ణిమ హెచ్చరించింది.

ఆ చుట్టుపక్కల రాలిన ఆకులు చిమ్మి శుభ్రం చేసే ఒక స్వీపర్ గత సంవత్సర కాలంగా ఆ స్నేహితురాళ్ళ కాలక్షేపం గమనిస్తున్నది. ఆ రోజున ఆమె కలుగ చేసుకొని, "పాపలూ, మీరందరు మంచిగ చదుకోనికి వచ్చింరు. దినాం మంచిగ మాట ముచ్చట్లు చేస్తరు. బిడ్డా! గా పోరి దోస్తి మీకొద్దమ్మ. దాని నియత్ మంచిగ లేదు. ఆమెను ఇడువుండ్రి." అనేటప్పటికి ముగ్గురికి నోటమాట రాలేదు.

ఆమెనే కొనసాగించింది. "దినాం ఆ పోరి కొరకు ఎవలెవలో అస్తరు ఆల్లతోని మోటర్సైకిల్ల పోవుడు. ఇంట్ల తెలుసునో తెల్వదో. లోకం గిట్ల పాడై చచ్చింది." అనుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.

పూర్ణిమ అన్నట్టు ముగ్గురికీ లూసీ గురించిన ఆలోచనలే తప్ప వేరే టాపిక్ మాట్లాడుకోవటం గాని ఇంతకు ముందులాగా చర్చించుకోవటం కాని లేకుండా పోయింది.

ఆ సంఘటన తరువాత పూర్ణిమ ఖచ్చితంగా లూసితొ చెప్పేసింది. "లూసీ ఇంక నువ్వు మా వెనక రాకు. నీకు చదువు వున్నా లేకపోయినా ఎక్కడో ఒక చోట పాటలు పాడుకుంటూ బతికేస్తావు. కాని మాకట్లా కాదు. మాకు డిగ్రీలో మంచి రాంక్ రాకపోతే కష్టం. నువ్వు ఆ నిమ్మి షర్మిలా వాళ్ళతోటే లంచ్ టైం గడుపు. నైట్ క్లబ్లలో పాడుకుంటావో, టాంక్బండ్ మీద పాడుకుంటూ బిచ్చమెత్తుకుంటావో మాకనవసరం. ఇంక మా దగ్గరకు రావద్దు."

"అట్లంటె ఎట్లనె. మనం చిన్నప్పటి స్కూల్ టైంసంది దోస్తులం కదనె. నాకు కాలేజిల మీరు తప్పు ఇంకెవలు లేరు. అమ్మ నాయ్న కూడ మీరున్నరనె ఈడ చేర్పించింరు. ఇంక మంచిక క్లాస్లకొస్తనే." దీనంగా అడిగేటప్పటికి ఇంకేం మాట్లాడ లేకపోయినారు.

లూసీ ఫ్రెంచ్ క్లాస్లోంచి బయటకు వచ్చింది. ఆమె వెనకాలే రాగిణి పరిగెడుతున్నట్టే రెండేసి మెట్లచొప్పున దిగి లూసీ ముందుకు వచ్చింది.

"ఏయ్ పోరి, బిచ్చకత్తె లెక్క ఎన్కపడితె పోనీ కదాని నా బాయ్ఫ్రెండ్ అర్జున్కి ఇంట్రడ్యూస్ చేసుంటి. ఏమే నిన్న వాన్తో నైట్క్లబ్ల మందుకొట్టి డాన్స్ చేస్నవంట. ఎన్ని గుండెలె నీకు?" అంటూ గట్టిగా చెయ్యి పట్టుకొని వూపింది.

మెట్ల మీద కూర్చున్న అమ్మాయిలందరూ స్టన్ అయిపోయి చూస్తూ వున్నారు. ఈ లోగా రాగిణి ఫ్రెండ్స్ షర్మిల, నిమ్మి, జూహీ కూడా వచ్చి చేరారు.

"అవ్. లాస్ట్ వీక్ విక్కీ తో కార్ల పోత కనబడ్డది. మా అన్న చెప్పబట్కి తెలిసింది."

"అగో ఆ వేలు మీద రింగ్ చూసినవానె? నేను సూరజ్ సెలెక్ట్ చేసి కొన్నము. సూరజ్ ఏడనో పోయిందన్నడు. ఈమెనె కొట్టేసినట్టున్నది."

"మంచిగ మన పక్కన చేరి మనల్నే బాక్స్టాబ్ చేసేటందుకు ప్లాన్ చేస్తున్నది. ఇగో పోరీ ఇదే ఫస్టండ్ లాస్ట్ వార్నింగ్. ఇంకో పాలి మా బాయ్ఫ్రెండ్స్ తో కనిపిస్తే చెమ్డలొలిపిస్తా బిడ్డా భద్రం."

ఒకళ్ళ తరువాత ఒకళ్ళు ఆ నలుగురూ లూసిని పట్టుకొని ఝాడించటం మొదలెట్టారు. కాని లూసి మొహంలో ఎటువంటి కంగారూ

లేదు. పొగరుగా, "పోపోండే. చేతనైతే వాండ్లను మీ కంట్రోల్ల పెట్టుకోండ్రి. నా మీద ఏడ్చేదెందుకు?" అని విసురుగా వెళ్ళిపోబోయింది.

జూహీ వెనక నుండి లూసీ డ్రెస్ పట్టుకొని ఒక్క గుంజు గుంజింది. ఆ వూపుకు పడబోయి నిలదొక్కుకుంది.

"జర సునో ఛోక్రీ. ఆగే కభీ ఐసా కరేతో......."

"ఏం చేస్తవే?"

"ఏం చేస్తానా? ఇంకొక్కసారి మా వాళ్ళతో కనిపించినా, నైట్ క్లబ్ వైపు వచ్చినా ఈ కాలేజీ ముందే మా కారు నీ మీద కెక్కిస్తాం భద్రం." అప్పటిదాకా ఏమీ మాట్లాడని షర్మిలా చూపుడు వేలు వూపుతూ బెదిరించింది.

"పోవే. ఏం చేసుకుంటావో చేసుకో. నేను చేసేడిది నేను కూడా చేసి చూపిస్త." అంటూ బింకంగా పోతున్న లూసీని చూసిన అమ్మాయిలకు కంగారు పుట్టింది.

ఇదేమన్నా కాలేజీనా? లేక సినిమాల్లో చూపించే గూండాల అడ్డానా? అనిపించి కంగారుగా అక్కడి నుండి తప్పుకున్నారు.

వారం రోజులు గడిచాక కుసుమకు అనుమానం వచ్చింది.

"పూర్ణిమా, ఆ ఇంసిడెన్స్ తరువాత లూసీ కనిపించటల్లేదే!. ఆ నలుగురూ కలిసి అన్నంత పనీ చేసేసారేమోనే?" భయంభయంగా అన్నది.

"ఛ, ఏదో కోపంలో బెదిరించినంత మాత్రాన ఒక మనిషిని లేపేటంత దిగజారుతారనుకోను. నువ్వు అనవసరంగా భయపడకు. అది ఎవడో కొత్త వెధవని పట్టుకొన్నదేమో! అయినా దాని గురించి మనం పట్టించుకోవద్దనే అనుకున్నాముగా? మళ్ళీ నీకెందుకీ తాపత్రయం?"

ఆ సమయానికి కుసుమను మందలించినా పూర్ణిమకు కూడా అనుమానంగానే వుంది. ఇన్నాళ్ళ సహవాసంలో ఎప్పుడూ స్కూల్ కాని కాలేజీ కాని డుమ్మా కొట్టకుండా వస్తుంటుంది లూసీ. ఇంటికన్నా ఇక్కడే తనకు ఎంటర్టైన్మెంట్ ఎక్కువగా వుంటుంది. ఇంట్లో అయితే ఎన్నెన్నో రిస్ట్రిక్షన్స్. కాలేజీలో అయితే ఫ్రీబర్డ్. అని కూడా అంటూ వుండేది. అటువంటిది వారం రోజులు రాలేదూ, అంటే కొంచం అనుమానం వచ్చింది.

"పోనీ రాగిణిని అడిగి చూద్దామా? వాళ్ళ నైట్క్లబ్లో పాటలు పాడుతుంది కదా!"

"ఏమోనే ఆ గొడవ తరువాత మళ్ళీ వాళ్ళకుకనిపించిందో లేదో?"

"అవన్నీ వాళ్ళ సర్కిల్స్‌లో కామనే. అట్లా బాయ్‌ఫ్రెండ్స్ కోసం కొట్టుకుంటూనే వుంటారు, మళ్ళీ కలుస్తూ వుంటారు. అయినా ఒక్కసారి అడిగి చూడటంలో పోయేదేమీ లేదు. అదిగో వాళ్ళే ఇటు వస్తున్నారు. అడిగి వద్దాము పదండి." ముగ్గురూ రాగిణి షర్మిల వద్దకు వెళ్ళారు.

"హాయ్ ఫ్రెండ్స్. ఏంటీ క్లాస్ లేదా? ముగ్గురూ ఒకచోటే వున్నారు?"

"రాగిణీ, సారీ టు డిస్టర్బ్ యూ. నీతో ఒక చిన్న అవసరం వచ్చింది."

వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు. హలో అంటే హలో అనుకోవటమే తప్ప వాళ్ళకు పెద్ద ఫ్రెండ్‌షిప్ లేదు. మరి వాళ్ళకు మనతో పనేంటో అన్న ప్రశ్న మొహాల్లో కనిపించింది.

"ఫరవాలేదు చెప్పు పూర్ణిమా. మాతో ఏం పని."

"ఆ రోజు మీతో గొడవయిం తరువాత లూసీ మళ్ళీ కాలేజీకి రాలేదు. మీకేమైనా తెలుసేమో.........." అర్ధోక్తిలో ఆగింది పూర్ణిమ.

"అరె, ఆ పోరి గురించా మీరింత పరేషానౌతున్నారు." అని నవ్వేసి, "మేం ఆమెను బెదిరించటానికి అట్లా మాట్లాడాము. అయినా మేమెక్కడ ఆ పోరెక్కడ. ఆమెను మేమేమైనా చేసామని భయపడుతున్నారా? మేం అంత చిల్లర మనుషులం కాదు. మీరేం ఫికర్ పడవద్దు.

ఆమెకు ఎవడో దొరికి వుంటాడు. వానితో తిరుగుతూ వుంటుంది." అని పోబోయినారు.

వారి భాష ఎంతో స్వచ్ఛంగా వుంది. ఆ రోజున లూసీతో మాట్లాడటం విన్న వాళ్ళకు నిజంగా తెలుగు సరిగ్గా రాదేమోనన్న అనుమానం వుండేది. ఎవరి దగ్గర వాళ్ళ మాట మాట్లాడే గుణం చాల బాగుంది.

"అది కాదు రాగిణీ, నీకేమైనా తెలుసేమో నని రిక్వెస్ట్."

"లేదు కుసుమా. ఆమె మాకు కాలేజిలోనే పరిచయం. మా డాడి ఫ్రెండ్‌కి ఫిల్మ్ సర్కిల్ లో బాగ పరిచయం వుంది. లూసీ వాయిస్ చాల బాగుంటుంది కదా అని నేనే ఆమెను ఎంకరేజ్ చేసాను. అంతకు మించి ఆమె పర్సనల్ విషయాలు మాకేమీ తెలియవు."

మేము పెరిగిన కల్చర్ వేరు. మీ కల్చర్ వేరు. అక్కడ  బాయ్‌ఫ్రెండ్స్ వుండటం నైట్‌క్లబ్‌లకు వెళ్ళటం అలవాటు. మా పేరెంట్స్ కూడా అబ్జెక్ట్ చేయరు. అయినా మా హద్దుల్లో మేము వుంటాము.

అటువంటిది లూసీ బాక్‌గ్రౌండ్ ఏమిటి? తను చేస్తున్న పనులేంటీ?

పాపం టాలెంట్ వున్నది కదా అని మేము ఎంకరేజ్ చేసింది తప్పయింది. వాయిస్ తో బిజినెస్ చేసేది వదిలేసి బాడీతో బిజినెస్ చేయటం మొదలైంది. అది తప్పు కదా!"

"పూర్ణిమ నువ్వు తరుణి కుసుమ మంచి మనసు కలవాళ్ళు కనుకనే ఆమె గురించి అంత వరీ అవుతున్నారు. ఇంక ఆమె ముచ్చట మర్చిపోండి. ఆమె మీకు ఫ్రెండ్ అంటే మీ మీద కూడా బాడ్ ఇంప్రెషన్ పడే చాన్స్ వుంది."

మళ్ళీ ఒకసారి లూసీ గురించి తమకేమీ తెలియదని గట్టిగా చెప్పి, "కమాన్ యార్. చీర్అప్ మీరు ముగ్గురూ మంచి క్లెవర్ స్టూడెంట్స్. ఈ ఫాల్తూ మాటర్ మర్చి మంచిగ చదువుకోండి"అని భుజం తట్టి వెళ్ళిపోయిన తరువాత వాళ్ళమీద అనవసరంగా అనుమానపడ్డామే అనుకున్నారు.

"ఇంక తన గురించి తెలుసుకోవాలంటే ఒకటే మార్గం. సీమకు కాని గ్లోరియాకు కాని లూసీ గురించి తప్పక తెలిసే వుంటుంది. వాళ్లంతా ఒకటే చర్చ్ మెంబర్స్ కదా." ఇంకా ఆశ చావని కుసుమను చూస్తే జాలిగా వుంది.

"సరే ఆ ప్రయత్నం కూడా చేద్దాము."

"హాయ్ గ్లోరియా."

"హాయ్ కుసుమా." నవ్వుతూ తిరిగి గ్రీట్ చేసింది గ్లోరియా.

"గ్లోరియా, లూసీ కాలేజీకి రావట్లేదు. నీకేమైనా తెలుసా?"

ఆ ప్రశ్నతో అప్పటిదాకా ఆమె మోహంలో వున్న ఫ్రెండ్లీ లుక్ మాయమై  భయం భయంగా చుట్టూ చూసింది.

"లేదు లేదు. ఆమె గురించి నాకేమీ తెలియదు. నేను పోతున్న." అంటూ తప్పించుకొని పోబోయింది.

కుసుమ గబుక్కున చెయ్యి పట్టుకొని ఆపి, "అంత భయపడతావెందుకు గ్లోరియా? ప్రతి ఆదివారం మీరంతా చర్చ్‌లో కలుస్తూవుంటారు కదా, ఆమె సంగతి మీకు తప్పక తెలిసే వుంటుంది. ప్లీజ్ చెప్పవా?"

"సారీ కుసుమా, మా ఇంట్లో ఆమె ముచ్చట తీస్తే చంపుతరు. ఆమె సంగతి మాకేం తెల్వదు."

ఇంక వాళ్ళేమీ చెప్పరని ఖాయంగా తెలిసింది. అయినా చివరి ప్రయత్నంగా, "పోనీ ఆమె సంగతి చెప్పకపోతే పోనీ, వాళ్ళ అమ్మ ఏదో స్కూల్లో టీచర్ అని తెలుసు. కాని ఏ స్కూలో తెలియదు. అదైనా చెప్పవా ప్లీజ్." చేతులు పట్టుకొని కళ్ళ నీళ్ళతో కుసుమ అడుగుతున్న తీరు చూసిన వాళ్ళకు జాలి అనిపించిందో ఏమో లూసీ తల్లి పని చేసే స్కూల్ ఎడ్రెస్ చెప్పారు.

ఆ మాత్రానికే మహానందపడిపోయిన కుసుమ గ్లోరియా రెండు చేతులు పట్టుకొని "థాంక్స్ గ్లోరియా థాంక్స్." అంటూ సంతోషం

వ్యక్తం చేసింది.

"కుసుమా ఎందుకే ఈ వృధా ప్రయాస? వాళ్ళ అమ్మ స్కూల్ ఎడ్రెస్ తెలుసుకున్నంత మాత్రాన ఏం సాధిద్దామని? అనవసరంగా లూసీ గురించి ఆలోచిస్తూ మనసు పాడు చేసుకుంటున్నావు." తరుణి మందలించింది.

"తరుణీ లూసీ ఏదో ప్రమాదంలో చిక్కుకున్నట్టుగా నా సిక్స్త్ సెన్స్ చెప్పుతున్నది. రాత్రుళ్ళు పడుకుంటే ఏవేవో పీడకలలు వస్తున్నాయి. ఏదేమైనా లూసీ గురించి తెలుసుకోవలసిందే. మీరందరూ ఆనుకుంటున్నట్టు దానికేమీ కాలేదు అంటే అంతకన్నా ఆనందం మరోటి లేదు."

"ఇంక ఈ రోజుకు క్లాసెస్ ఎటెండ్ అయ్యే మూడ్లేదు. నేను లూసీ అమ్మ స్కూల్ కెళ్ళి విషయం కనుక్కొస్తాను. మీరు క్లాస్లకెళ్ళండి."

పూర్ణిమ తరుణి మొహాలు చూసుకున్నారు. "ఒక్కదానివే ఎందుకు? మేము కూడా నీతోనే వస్తాము పద."

★★★★★★★★★★★★★★★

మధ్యాహ్నం రెండున్నర అవుతున్నది. స్కూల్ అవరణలో టెన్షన్‌గా అడుగు పెట్టారు. ఆ టైంలో బిజీగా వుండాల్సిన స్కూల్ ఖాళీఖాళీగా కనిపించేటప్పటికి విస్తుపోతూ లోపలికి వెళ్ళారు.

స్టాఫ్‌రూంలో ఒక్కడే కూర్చొని వున్న టీచర్ కనిపించారు. "ఎక్స్‌క్యూజ్‌మీ" అన్న మాటలకు తలఎత్తి చూసిన ఆయనకు ముగ్గురు అమ్మాయిలు కనిపించారు.

"ఎస్ కమిన్. ఎవరమ్మా మీరు? ఎవరు కావాలి?"

"సార్ మేరీ మాడం కోసం వచ్చాము. ఆవిడ ఎక్కడుంటారో చెప్పుతారా?"

ఆయన కళ్ళజోడు తీసి తుడుచుకొని మళ్ళీ పెట్టుకొని, "కూర్చోండమ్మా." అని, "ఆవిడతో మీకేం పని?"

"సార్ ఆమె కూతురు లూసీ మా క్లాస్‌మేట్. తను వారం రోజులుగా కాలేజీకి రావటం లేదు. మాడంను అడిగి తెలుసుకుందామని వచ్చాము."

ఆయన వాళ్ళ వంక అనుమానంగా చూసాడు. "అమ్మాయిలు, లూసీ మీ ఫ్రెండ్ అంటున్నారు. మరి ఇంటికి వెళ్ళి అడగక పోయినారా? ఎక్కడి ఫ్రెండ్‌షిప్? "

"సార్ మాకు వాళ్ళ ఇల్లు తెలియదు. మేమంతా స్కూల్ రోజుల నుండి క్లాస్‌మేట్స్. అందరమూ ఆ రోజుల నుండే కంబైన్డ్ స్టడీస్ చేసే వాళ్ళము. తనే మా ఇళ్ళకు వచ్చేది. ."

"ఓ, మీ గురించేనా మేరి మాడం చెప్పుతుండేవారు? మీ ఫ్రెండ్‌షిప్ తోనే లూసీ కొంచం బాగా చదవటం మొదలెట్టిందని చెప్పే వారు ఆవిడ. కాని ఏం లాభం లేదమ్మా. లూసీ పూర్తిగా చెడిపోయింది. అడ్డమైన తిరుగుళ్ళు తిరిగింది. పోయిన వారం ఎబార్షన్ కోసం ఏదో నాటు మందు తిని ప్రయత్నించిందిట. అది కాస్త వికటించి పెద్ద ప్రాణానికే ముప్పు వచ్చి ఇప్పుడు ఆమె చావుబతుకులతో పోరాడుతోంది. నేను పొద్దున వెళ్ళి చూసి వచ్చాను. లాభం లేదు. ఇప్పుడో అప్పుడో అన్నట్టున్నది పరిస్థితి. మిగతా మా స్టాఫ్ అంతా చూడటానికి ఇంటికి వెళ్ళారు."

ముగ్గురూ నోటమాటలేక అట్లాగే కూర్చుండిపోయారు. కుసుమ వస్తున్న ఏడుపు ఆపుకొని, "సార్, కొద్దిగా వాళ్ళ ఇంటి ఎడ్రెస్ ఇస్తారా? మేము వెళ్ళి చూసి వస్తాము."

"వద్దమ్మా. మీరు చిన్న పిల్లలు. ఇళ్ళల్లో చెప్పకుండా చావులకు వెళ్ళకూడదు. అయినా మీరు వెళ్ళి చేసేది కూడా ఏమీ వుండదు. పోండి." ఆయన నచ్చ చెప్పబోయినాడు.

కాని కుసుమ మొండి పట్టుపట్టటంతో అటే పోతున్న ఆయాను పిలిచి, "ఆయమ్మా, మేరీ మాడం ఇంటికి వెళ్ళుతానన్నావుగా, ఇదిగో ఈ అమ్మాయిలు కూడా వస్తారట, వెంట పెట్టుకొని వెళ్ళు. పోండమ్మా, ఇల్లు ఈ దగ్గరే, నడిచిపోవచ్చు.

"పాపం మేరమ్మ. ఈ పోరి చిన్నగున్నప్పటిసంది ఆమె గురించే ఫికర్ పడేది. పాపం స్కూల్ కొచ్చి చెప్పుకొని ఏడ్చేడిది. ఒక్కతె బిడ్డ మంచిగ పెళ్ళి చేతమని ఎంతో కోషిష్ చేస్తుండె."

అంటూ దారిపొడుగూతా మాట్లాడుతూనే వుంది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments